సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
బుధవారం, ఆగస్టు 07, 2024
డిజిటల్



# సార్.. యాదిలో..

## జయశంకర్ సార్ సేవలు మరువలేనివి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) : న్యూఢిల్లీలో ఆచార్య జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో కలిసి ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను చాటి చెప్పిన మహోన్నత ఉద్యమ శిఖరం... తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని, వారి స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శకత్వంలో బంగారు తెలంగాణగా మార్చామన్నారు. సూర్యచంద్రులు ఉన్నంతవరకు ఆచార్య జయశంకర్ ని వారి సిద్ధాంతాలను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరువలేరన్నారు.

## ఘనంగా జయశంకర్ జయంతి



## సార్ త్యాగాలు స్ఫూర్తిదాయకం

### సిరిసిల్ల మున్సిపల్ చైర్పన్ జిందం కళ చక్రపాణి

తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) : ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన త్యాగాలు స్ఫూర్తిదాయకమని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రా పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం తెలంగాణ ఏర్పాటు కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన త్యాగాలు స్ఫూర్తిదాయమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ
WANTED
సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయ గలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి
'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'
ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్:99854 44342



## వర్గీకరణపై సంబురాలు

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పై సుప్రీం కోర్టు తీర్పు ను స్వాగతిస్తూ మంగళవారం దళిత ఉద్యమ నేత ముత్యపాగ శ్రీశైలం మాదిగ అధ్వర్యంలో గాజులరామారం చౌరస్తాలో మహనీయుల విగ్రహాల డాక్టర్. అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ల విగ్రహాల వద్ద ఉద్యమ పోరాట యోధుడు మాన్య శ్రీ మంద కృష్ణ మాదిగ ఫొటోకు పాలాభిషేకం చేసిన ప్రజాసంఘాల నాయకులు, ఈకార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కింద అట్టడు గుస్థాయి వర్గాలకు కూడా సమన్యాయం చేసే విధంగా తీర్పు వచ్చినందుకు ఆనందంతో పండగ చేసుకుంటున్నామని తెలిపారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకారుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దరువు అంజన్న, మాదిగ జర్నలిస్ట్ ఫోరం జాతీయ నాయకులు దప్పు రామస్వామి, మాదిగ స్టూడెంట్ ఫోరం జాతీయ నాయకులు చిరంజీవి, దండోరా ఉద్యమ నాయకులు తిరుపతి, ఎమ్ జె ఎఫ్ సీనియర్ నాయకులు, కళాకారుడు జోగు వెంకట్, బి ఆర్ ఎస్ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు దుద్దు లక్ష్మణ్ ,ఎమ్ ఆర్ పి ఎస్ నాయకులు రవి, మహిళా నాయకురాలు జాజాల రమ్య మాదిగ,దుబాక లక్ష్మణ్ మాదిగ, ముత్యపాగ విజయ్ మాదిగ అధిక సంఖ్యలో మాదిగ ఉప కులాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మధ్యాహ్నం భోజనం పరిశీలన

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల పరిధిలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలను జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడు సీతారాం నాయక్ రాథోడ్ పరిశీలించారు. గత నాలుగు రోజుల క్రితం వివిధ పత్రికలలో విద్యార్థులు కారంపొడితో భోజనం తిన్నారని శీర్షిక రావడంతో వారు పాఠశాలను సందర్శించి విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ వివరాలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నిర్వాకులతో మాట్లాడుతూ రుచికరమైన వంటలను వండి విద్యార్థులకు వడ్డన చేయాలని సూచించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనాన్ని విద్యార్థులకు వండి పెట్టాలన్నారు.వారు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులు తినే ముందు వంటలను పరిశీలించి రుచికరమైన వంటలు ఉన్నచో భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని వడ్డన సరిగా చేయనీ యెడల జిల్లా స్థాయిలో రాస్తారోకోలు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా నాయకుల వెంట పాఠశాల చైర్మన్ కొర రవి,అధికారులు మండల విద్యా అభివృద్ధి అధికారి నాగనాథ్ మండల అధికారులు పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సార్.. యాదిలో..

## రాష్ట్ర సాధన కోసం జీవితం అంకితం

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్ జయ శంకర్ జీవితం ఆదర్శప్రాయం బిఆర్ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రగతిభవన్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమైక్యాంధ్రలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని జయశంకర్ ఎలుగెత్తి చాటారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ గూడూరు ప్రవీణ్, పలు నాయకులు పాల్గొన్నారు.






## ఎంపీడీవో ఆఫీసులో జయశంకర్ జయంతి వేడుకలు

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల సందర్భంగా ఎంపీడీవో కేఆర్. మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయులు తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్ర పటానికి ఘన నివాళులు అర్పించారు. ఆయన తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత ఉద్యమ శిఖరం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఏపీఓ గంగాధర్ ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వికాస్ డిగ్రీ కళాశాలలో జయశంకర్ సార్‌కి నివాళి

**తెలంగాణ ప్రభ (కోటగిరి) : వికాస్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గుగ్గిళ్ళ జగన్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్తగా ప్రొఫెసర్ జయశంకర్ జీవితాన్ని తెలంగాణ కోసం ధారపోసాడని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం తో పాటు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి మధు విద్యార్థులు పాల్గొన్నారు.**





# తల్లిపాలే శ్రేయస్కరం

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** పోతంగల్ మండలంలోని చేత నగర్ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు అంగన్వాడి టీచర్ ద్రౌపతి ఆధ్వర్యంలో పిల్లల తల్లులతోపాటు అంగన్వాడీ టీచర్లు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంగన్వాడి సూపర్వైజర్ మనీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ... మంతృత్వ స్పర్శకు ప్రతి మహిళ పరితపిస్తుంది. పుట్టిన బిడ్డకు ప్రేమను ఆస్వాదించాలని ఆరాటపడుతుంది. ఆ సమయంలో తల్లి పాలు పసికందుకు సంజీవనిల పనిచేస్తుందని వైద్య నిపుణులు నొక్కి చెప్పారు. ఇంటికి దీపం ఇల్లాలు అయితే, ఆ దీపం ప్రసరించే వెలుగు రేఖలు సంతానమని తెలిపారు. తల్లి పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటేనే ఆ ఇల్లు కాంతులను ఇస్తుందన్నారు. తల్లి బిడ్డల ఆరోగ్యం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో



ఆరోగ్య పథకాలను అమలు చేస్తుందని చిన్నారుల తల్లులకు తెలియజేశారు. ఇందులో భాగంగా ప్రతి యేటా ఆగస్టు ఒకటి నుంచి ఏడవ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించటం జరుగుతుందని అన్నారు. పుట్టిన గంటకే ఇచ్చే ముర్రుపాలతో శిశువుకు బలం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ద్రుపతి,పలు సెంటర్ల అంగన్వాడీ టీచర్లు , పిల్లలు తల్లులు, ఆయమ్మ, గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు జాతీయ చేనేత దినోత్సవం

### హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సాగర్

### సిరిసిల్లలో ర్యాలీ, కార్యక్రమాలు

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఎడి సాగర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల లోని బీవై నగర్ లోని హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ కార్యాలయం నుంచి సిరిసిల్ల పాత బస్ స్టాండ్ నేతన్న చౌక్ దాకా ర్యాలీ తీయనున్నట్లు తెలిపారు. అనంతరం బీవై నగర్లోని షాది ఖానాలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా ముఖ్య అతిథులను ఆహ్వానించి, అందరితో కలిసి ప్రతిజ్ఞ చేయనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామని ఏడీ అన్నారు.

# పిచ్చుకల్ని ప్రేమించండి

డాక్టర్ కందేపి రాణీప్రసాద్





వరి చేలలో గింజలేరుకుంటూ; అద్దంలో అందం చూసుకుంటూ; ఇంటి చూరులో సంసారం కిచకిచ లాడుతూ విహారం; అంటూ 'మిఠాయి పొట్లం' పొడుపు కథల పుస్తకంలో డా॥ కందేపి రాణీప్రసాద్ పిచ్చుకల కోసం పొడుపుకథను రాశారు. అలాగే "పిచ్చుకా మా ఇంటి కొస్తావా" అంటూ 'సీతాకోక చిలుక' అనే గేయాల పుస్తకంలో మాయమై పోతున్న పిచ్చుకల కోసం "వరికంకులు లేవుగాని, పిజ్జాలు పెడతాను వస్తావా" అంటూ రాణీ ప్రసాద్ నేటి పరిస్థితికి అద్దం పట్టే కవితను రాశారు. సెల్ ఫోను తో ఆటలాడే పిచ్చుక పిల్లను పాత్ర ధారిగా చేసి "మనల్ని దారుణంగా చంపేసి ప్రమాద స్థితిలోకి నెట్టివేసే సెల్ ఫోనుల తోనే ఆడతావా" అంటూ పిచ్చిన తల్లితో సెల్ ఫోన్ టవర్లే పిచ్చుకల పాలిటి యమ దూతలు అని చెప్పిస్తూ "పిచ్చుక పిల్లల తప్పు" అనే కథలో చెప్పారు. మానవులతో సహజీవనం చేసే కాకులు, పిచ్చుకలు, కోళ్ళు వంటి మామూలు పక్షుల్ని "పక్షుల అభయారణ్యాలలో చూడవలసిన పరిస్థితి ఏర్పడుతుం దని వివరిస్తూ 'సైన్స్ వరల్డ్' పుస్తకంలో సైన్స్ వ్యాసాన్ని రాశారు. పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని పిచ్చుకల బొమ్మల్ని తయారుచేసి ఎగ్జిబిషన్లు పెట్టారు రాణీప్రసాద్. వంటింట్లో ఉండే ధాన్యపు గింజలతో పిచ్చుక బొమ్మల్ని తయారు చేశారు. ఈ రోజు మనం పిచ్చుకల దినోత్సవం గురించి తెలుసుకుందాం! ప్రతి సంవత్సరం మార్చి 20వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా పిచ్చుకల దినోత్సవం జరుపుకుంటారు. మానవ ఆవాసాల్లో తిరిగే పక్షులకు వాటి జీవనానికి ఏర్పడుతున్న ముప్పు గురించి అందరికీ తెలియాల్సిన అవసరం ఎంతో ఉన్నది బియ్యం చేట పట్టుకుని ఇల్లాలు ఇంటి బయటి కొస్తే చుట్టు పక్కల ఉన్న పిచ్చికలన్నీ ఎదురుగా వాలేవి. బియ్యం చెరిగేటపుడు జారిపోయే ధాన్యం గింజల కోసం ఎదురు చూస్తుండేవి. ఈనాడు బియ్యం చేట పట్టుకుని బియ్యం చెరిగే ఇల్లాలూ లేదు. వాటికై ఎదురు చూసే పిచ్చుకలు లేవు. పూర్వ కాలపు ఉదయాలు పక్షుల కిలకిలా రావాల తోనే మొదలయ్యేవి. ఈనాడు అలారం మోతలలో ఫోన్ చేసే రింగ్ టోన్లతో మేలు కుంటున్నారు. అలా మనతో పాటు సహజీవనం చేస్తూ మనం పెట్టినవి తింటూ, మన ఇంటి చూరుల్లో గూళ్ళు కట్టుకుని పిల్లల్ని కంటూ తిరిగే పిచ్చుకలు నేడు కనిపించకపోవటానికి గల కారణాల్లో మానవ తప్పిదాలే ఎక్కువగా ఉన్నాయి. ఆ అవగాహన కొరకే ప్రపంచ పిచ్చుకల దినోత్సవం జరుపుకుంటున్నారు.

పక్షుల మనుగడకు ఏర్పడుతున్న అనేక ఆటంకాలు, వస్తున్న ముప్పుల గురించి ఒకరితో ఒకరు చర్చించుకునేందుకు ఒక రోజు అవసరం అయినందున పిచ్చుకల దినోత్సవానికి ఒక రోజును ఏర్పాటు చేయాలని పర్యావరణవేత్తలు అనుకున్నారు. పక్షుల పరిరక్షణకు ఒక వేదిక కావాలని, ఒకరి అభిప్రాయాలు మరొకరితో పంచుకునే ఉమ్మడి వేదిక అవసరమని పక్షి శాస్త్రవేత్తలు భావించారు. దీనికి అందరూ ఆమోదయోగ్యం తెలిపారు. ఫలితంగా తొలిసారిగా 2010 వ సంవత్సరంలో 'పిచ్చుకల దినోత్సవాలు' ప్రపంచంలో అనేక చోట్ల జరిగాయి. ఆ రోజున పిచ్చుకల జీవన విధానం గురించి సదస్సులూ, వాటికి ఉన్న అనుకూల వాతావరణం, అననుకూల పరిస్థితులు, పిచ్చుకలు చనిపోవడానికి కారణమవుతున్న సెల్ ఫోన్ టవర్ల గురించి అనేక అవగాహనా కార్యక్రమాలు జరుగుతాయి. కళలకు సంబంధించిన పోటీలు ఉపన్యాసాలు, పిచ్చుక బొమ్మల ఊరేగింపులు రకరకాలుగా ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నాలు జరుగుతాయి. హైదరాబాదు లోని కెబిఆర్ పార్కులోనూ పిచ్చుకల దినోత్సవాన్ని జరుపుతారు. పిచ్చుకల పాటోలను చెట్లకు కట్టి పిచుకమ్మలపై పాటలు పాడుతూ ఉత్సవాల్ని జనరంజరంగా నిర్వహిస్తారు. ఇంకా స్కూళ్ళలో వీటి గురించి తెలియజేస్తూ విద్యార్థులతో సైతం అనేక బొమ్మలు, వ్యాసాలు రాయిస్తూ అందరి మనస్సుల్లోకీ చొప్పించేలా ప్రయత్నించాలి. భారతీయ ప్రకృతి పరిరక్షకుడైన మహమ్మద్ దిలావార్ పిచ్చుకల పరిరక్షణ కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాడు. 'నేచర్ ఫర్ సొసైటీ' అనే సంస్థను స్థాపించాడు తద్వారా అనేక రకాలుగా పిచ్చుకలను రక్షించడానికి వీలైన అవకాశాల్ని అందరితోనూ పంచుకున్నాడు. సొసైటీ కార్యాలయంతో తోటి సభ్యులతో మాట్లాడుతున్నపుడు పిచ్చుకల కోసం ఒక రోజును కేటాయించుకుంటే ఎలా ఉటుంది అనే ఆలోచన వచ్చింది. అలా పిచ్చుకల దినోత్సవం ఏర్పడింది. ఇది కేవలం పిచ్చుకలను రక్షించడమే కాకుండా జీవ వైవిధ్య ఆశయాలను నెరవేర్చడం కోసం కూడా ఉపయోగపడుతుంది. ఈ విధంగా పిచ్చుకల దినోత్సవానికి ఆద్యుడైన మహమ్మద్ దిలావర్ కు "హీరోస్ ఆఫ్ ద ఎన్విరాన్‌మెంట్" లో ఒకరుగా గుర్తించి, వీరి న కృషిని అందరికీ తెలిపింది 'టైమ్'. ఆ తర్వాత పిచ్చుక పురస్కారాలను కూడా ఇవ్వడం ప్రారంభించారు.

2011 వసంవత్సరం నుంచి పిచ్చుక పురస్కారాలను అందజేయడం ప్రారంభించారు. 2011 లో భవిన్ షా, నరేంద్రసింగ్ చౌదరి, ఎల్. శ్యామల్, దస్వారో కంపెనీ అనే నలుగురికి ఈ అవార్డు నిచ్చి సత్కరించారు. ఎన్.ఐఫ్.ఎస్ అనే సంస్థ మొదటిసారిగా ప్రజలలో అవగాహన పెంచుట కొరకు పిచ్చుక పురస్కారాలను ఏర్పాటు చేసింది మొదటిసారిగా గుజరాత్ రాష్ట్రంలోని అహమ్మదాబాద్ లో మార్చి నెలలో 20 వ తేదీన ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. అప్పటి నుంచి వరసగా ఈ పురస్కారాలను అందజేస్తూనే ఉన్నారు. మోహన్ గార్గ్, ఎన్. షహజాద్ & ఎం.సౌద్, జల్ గ్రాహన్ కామేటి, ఫ్లిప్కార్ట్ లకు 2014 వ సంవత్సరానికి గాను పిచ్చుక పురస్కారాలను అందజేశారు.

గ్రామాలలో పొలాల్లోని గింజలు ఏరుకుని తింటూ కిచకిచమని అరుపులతో ఉదయాన్నే అందర్నీ లేపుతూ మానవులతో పాటు జీవనం సాగించేవి. తల్లి తెచ్చే ఆహారం కోసం తమ బుల్లి నోర్లు తెరుచుకుని ఎదురుచూస్తూ ఉండే పిల్లల్ని మనం చూడలేకపోతున్నాం.

ఎండు కొమ్మలు, రెమ్మలు, మెత్తటి గడ్డ పీలికలు వంటి వాటితో గూడును ఏర్పరచుకుని భ ద్రంగా తన గుడ్డను పెట్టుకుని పొదుగుతాయి. పిచ్చు కలు ఎర్రటి నోర్లు తెరుచుకుని తల్లి తెచ్చిన గింజల్ని లాక్కోవడానికి తోటి పిచ్చుక సోదరులలో పోటీపడే అద్భుత దృశ్యాల్ని చూసే అదృష్టం ఈనాటి బాల్యాని కి లేదు. తొట్టి దగ్గర కాళ్ళు కడుక్కుని వస్తే ఆ నీళ్ళను తాగుతూ తమ దాహాన్ని తీర్చుకునే పక్షులే లేవు. పిచ్చుక పిడకలిల్లు కట్టుకుంది, కాకి కర్రలిల్లు కట్టుకుంది అని కథలు చెప్పే బామ్మలూ లేరు. పిచ్చుకలతో అనుబంధం ఈ నాటి తరానికి పూర్తిగా తెగిపోయింది. పిచ్చుకల ఆత్మ ఘోషను వినిపించడానికే రోబో సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు ఇక ముందు పిచ్చుకలను చంపే ప్రయత్నాలకు అడ్డుగా నిలవాలని, పిచ్చకలను ప్రేమించి పర్యావరణంలో వాటి పాత్రను అవి పోషించేలా చేయాలని కోరుకుందాం.



పేదల భూములకు

## పట్టాలివ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** పేద దళితులు సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. మంగళవారం కార్మిక భవన్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో గుంటి వేణు మాట్లాడుతూ గత ప్రభుత్వం వైకుంఠ దామాలు, డంపు యార్డులో పేరుతో ధరణి పేరుతో జిల్లాలో దళితుల దగ్గర భూములు లాక్కున్నారని అన్నారు. వేములవాడ మండలం మర్రిపల్లి గ్రామంలో 100 మందికి సంబంధించిన 200 ఎకరాలు గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని ప్రభుత్వం పట్టాలు ఇవ్వడం లేదని ఆరోపించారు తక్షణం అర్హులైన వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కుంగ్ ఫు

## కరాటే ఛాంపియన్షిప్


సిరిసిల్లలో పోస్టర్ల ఆవిష్కరణ

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** ఆల్ స్టైల్ కుంగ్ ఫు యూనిట్ ఆఫ్ తెలంగాణ మాస్టర్స్ ఆధ్వర్యంలో కరీంనగర్ లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ వద్నాల శ్రీనివాస్ తెలిపారు. సిరిసిల్లలో మంగళవారం పోటీలకు సంబంధించిన బ్రోచెర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆగస్టు 25న కరీంనగర్లో జరిగే పోటీల కోసం రాష్ట్రంలోని 12 జిల్లాల నుండి పోటీలకు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ మామిడాల సమ్మయ్య, ఎండి సమీనా, దివ్య, విక్రమ్ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిది

సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్

జిందం కళ చక్రపాణి




**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి అన్నారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డులో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాల పరిరక్షణ కోసం ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పచ్చదనాన్ని కాపాడేందుకు చెట్లను పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డి ఈ ప్రసాద్, ఏఈ నరసింహ స్వామి, టి పి ఎస్ అభినవ్, సానిటరీ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## స్వచ్ఛదనం.. పచ్చదనం..

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పాఠశాల ఆవరణలో తహసిల్దార్ కే. గంగాధర్ స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కను నాటారు. అనంతరం గ్రామంలో పల్లె దావఖాను పరిశీలించారు. ఆశా వర్కర్లకు సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి,తహశీల్దార్, ఎంపీడీవో ఎంపీవో,ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల కమిటీ చైర్మన్, గ్రామస్తులున్నారు.



# మీ జీవితంపై మీకు ‘కంట్రోల్’ ఉందా?

గతేడాది ‘డ్రీమ్ గర్ల్ 2’, ‘ఖో గయే హమ్ కహా’తో ప్రేక్షకులను మెప్పించిన బాలీవుడ్ యువకథానాయిక అనన్యపాండే.. ఈ ఏడాది వరుస సినిమాలతో తెరపై సందడి చేయనుంది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ‘కంట్రోల్’. విక్రమాదిత్య మోత్వానే తెరకెక్కిస్తున్నారు. విహాన్ సమత్ కీలకపాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా అక్టోబరు 4న రానుందని ప్రకటిస్తూ.. ఓ వీడియో పంచుకుంది అనన్య. ‘జీవితంలోని అనుబంధాలు, ఆనందాల విషయంలో మీ మనసు మీ నియంత్రణలో ఉందని అందరూ అనుకుంటున్నారు. కానీ ఓ సారి ఆలోచించండి’ అంటూ సాగుతున్న ఈ వీడియోను ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నది. ఈ సందర్భంగా అనన్య మాట్లాడుతూ.. “కంట్రోల్’ కథ వినగానే నాకెంతో నచ్చింది. నేను ఇందులో నెల్లా అవస్థి పాత్రలో కనిపించనున్నాను. మీ జీవితంపై మీరు నిజంగా నియంత్రణలో ఉన్నారా? అనేది తెలుపుతుందీ చిత్రం. సాంకేతిక పరిజ్ఞానాన్ని మితిమీరి వాడడం వల్ల ఎలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయనే విషయాన్ని సందేశాత్మకంగా చూపించే చిత్రమిద’ని చెప్పుకొచ్చింది. సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ.. దాన్నే జీవితంగా మలుచుకున్న ఓ జంట కథను ఇందులో చూపించనున్నారు. ఈ చిత్రం అక్టోబరు 4న ఓటీటీలో విడుదల కానుంది.